# తిమిర సంహారణం

తిమిర స
తిమిర స

**మొత్తానికి నేను కోరుకున్నట్టే హైదరాబాదుకి ట్రాన్స్‌ఫర్ వచ్చేసింది. ఈ బ్రాంచిలో ఎక్కువ స్టాఫ్ లేరు. మేనేజరుతో కలిపి మొత్తం పదిమంది ఉంటారు అంతే. జాయినయిన వారానికే బాగా అలవాటుపడ్డాను. ఇక్కడ పని అంతగా లేదు. కాలక్షేపం బాగానే ఉంది. ఓ చిన్న రిక్రియేషన్ క్లబ్ కూడా ఉంది.**

అసలు ఇన్నాళ్ళూ ఆ పల్లెటూర్లో ఎలా ఉద్యోగం చేశానా అని ఆశ్చర్యంగా ఉంది. ఛీ!ఛీ! ఎక్కడ చూసినా మురికే. చదువూ సంధ్యాలేని వాళ్ళందరూ కష్టమర్లు అక్కడ. నూటికి తొంభైమంది వేలుముద్ర గాళ్ళే. వాళ్ళకి అన్నీ అర్థమయ్యేట్టు వివరించేసరికి తలప్రాణం తోకకొచ్చేది.

"సార్! మీకు క్యారేజీ తెచ్చాను." అటెండర్ నాగరాజు పిలుపుతో ఆలోచనల్లోంచి ఈ లోకంలో కొచ్చాను. క్యారేజ్‌తో పాటు ఓ లెటర్ కూడా తెచ్చాడు. ఎక్కడి నుంచి అయ్యుంటుంది? ఇంకెక్కడి నుంచి అయ్యుంటుంది? అమ్మ దగ్గరి నుంచే వచ్చుంటుంది. ఎప్పుడూ డబ్బో డబ్బో! ఇంతకంటే ఏమీ ఉండదిక! అయిష్టంగానే తీసుకుని చదవడం మొదలుపెట్టాను.

చిరంజీవి గోపీకి,

మీ అమ్మ ఆశీర్వదించి వ్రాయునది. ఇక్కడ మేమంతా క్షేమం. అక్కడ నీవు కులాసాగా ఉన్నట్లు తలుస్తాను. అక్కడ నీకు ఎలా ఉంది? అసలే క్రొత్త ప్రదేశం. ఆరోగ్యం బాగా చూసుకో. నిన్ననే చెల్లాయికి ఓ సంబంధం చూశాను. అబ్బాయి బాగానే ఉన్నాడు. పిల్ల కూడా నచ్చిందన్నారు. కానీ మిగతా విషయాలు నీతో సంప్రదించాక చెబుతానన్నాను. ఎందుకంటే నా దగ్గరున్నది కాక ఇంకా కనీసం పదివేలయినా అవసరమౌతాయి. ఇక ఇప్పుడు నీ ఇష్టం. నువ్వు సరేనంటే



వెంటనే వాళ్ళతో వెళ్ళి చెబుతాను. నువ్వు ఆలోచించుకుని ఏ సంగతీ ఉత్తరం వ్రాయి. చెల్లాయి నిన్ను అడిగినట్లు వ్రాయమంది. నీ ఆరోగ్యం జాగ్రత్త. ఉంటాను మరి.

ఆశీర్వచనములతో.....

మీ అమ్మ.

ఉత్తరం పూర్తయ్యేసరికి నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. పదివేలంటే పదిరూపాయలు లాగా కనబడతాయేమో

— పారుపూడి విశ్వేశ్వరరావు

అమ్మకు! అనుకుంటూ క్యారేజీ తీసుకుని డైనింగ్ రూములోకి దారితీశాను. అప్పటికే అక్కడ మా కొలీగ్స్ అంతా చేరి లంచ్ మొదలుపెట్టారు. మా బ్యాంక్ దగ్గరే ఓ చిన్న మెస్ ఉంది. చాలా మంది అక్కడి నుంచే క్యారేజీ తెచ్చుకుంటారు. నేను కూడా అదే పద్ధతి మొదలు పెట్టాను. భోజనం బాగానే వుంటోంది. మా డైనింగురూము చాలా విశాలంగా ఉంటుంది. ఇదే ఆ పల్లెటూర్లో అయితే ఎవరి సీటు దగ్గర వాళ్ళు తినాలే తప్ప వేరే గది అంటూ వుండేది కాదు.

క్యారేజీ విప్పుతూ ప్రక్కకి చూసేసరికి నాగరాజు తన బాక్సు తీసుకుని బయటికి వెళ్ళిపోతున్నాడు.

"అదేమిటి నాగరాజూ! నువ్వు ఇక్కడ తినవా!" అన్నాను నేను.

"లేదు సార్! నేను తెచ్చుకున్నదీ...." అంటూ మిగతాది ముక్కు మూసుకుని అభినయించాడు.

"అతను ఎప్పుడైనా ఎన్.వి. తెచ్చుకుంటే అలా బాల్కనీలోకి వెళ్ళి తింటా ఉండి. అది అతని పద్ధతి" అన్నాడు మా కొలీగ్ ప్రభాకరం. ఓహో అదన్న మాట సంగతి అనుకొన్నాను.

సాయంత్రం బ్యాంక్ నించి బయలు దేరుతూ ఉండగా మళ్ళీ అమ్మ వ్రాసిన ఉత్తరం గుర్తొచ్చింది. అయినా 'ఏదో గంతకు తగ్గ బొంతలాంటి సంబంధాలు చూడకుండా పదేపివేలు కట్నాలు ఎందుకు? పరిస్థితులు చూసుకోఖర్లా! ఆ తర్వాత నేనేమై పోవాలి! లాభంలేదు. దీనికి ఏదో ఉపాయం ఆలోచించాలి' అనుకున్నాను.

* * *

బ్యాంకు తెరిచినప్పటినుంచీ రద్దీగానే ఉందీరోజు. చాలా మంది గోల్డులోన్ కోసం వచ్చారు. అంత రద్దీలోనూ అమ్మకి ఏం సమాధానం వ్రాయాలా అని ఆలోచిస్తూనే వున్నాను. కానేపయాక ఓ ఆలోచన వచ్చింది. బానే వుంది కానీ కొంచెం ఆడ్గా ఉంటుందేమోననిపించింది. అయినా ఫరవాలేదు. అమ్మలాంటి అమాయకురాలు అది గ్రహించలేదు అనుకున్నాను. ఇంతలో కరెంటు పోయింది. కానీ ఇక్కడ ఉక్కపోతలో మ్రగ్గిపోవాల్సిన అవసరం లేదు. మా బ్యాంక్‌కు జనరేటరు ఉంది. అదే ఆ పల్లెటూళ్ళో అయితే ఇక ఇంతే సంగతులు. సాయంత్రం దాకా చెమట కంపు భరించాల్సిందే. ఎప్పుడు కరెంటు పోతుందో మళ్ళీ ఎప్పుడొస్తుందో తెలీదు. నిజంగా నేను చాలా అదృష్టవంతుణ్ణి కాబట్టే కోరగానే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది.

పన్నెండయ్యేసరికి దాదాపు కష్టమర్లందరూ వెళ్ళిపోయారు. కాగితం తీసుకుని అమ్మకు ఉత్తరం వ్రాయడం మొదలు పెట్టాను.

ప్రియమైన అమ్మకు,

గోపీ వమస్కరించి వ్రాయునది.

ఉత్తరం అందింది. చెల్లాయి పెళ్ళి సంబంధం గురించి నీవు వ్రాసినది చదివి చాలా ఆనందించాను. కానీ ఒక్క విషయం వ్రాయడానికి నాకు చాలా బాధగా ఉంది. నేను ఇక్కడ చేరిన రెండో రోజే నాకు అపెండిసైటస్ వచ్చింది. మా కొలీగ్స్ వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. ఆపరేషన్‌కి మూడువేలు ఖర్చయ్యింది. ఇంకా కొంతకాలం మందులు వాడమన్నారు. ఇప్పుడు బాగానే ఉంది. నీకు తెలిస్తే కంగారు పడతావని వ్రాయలేదు. మొత్తం చాలా ఖర్చయింది. అయినా వాళ్ళనీ వీళ్ళనీ అడిగి ఓ నాలుగువేల దాకా సర్దుబాటు చేస్తాను. అవసరమైనప్పుడు సహాయ పడలేకపోతున్నందుకు నాకు చాలా బాధగా ఉంది. చెల్లాయిని అడిగినానని చెప్పు.

ఇంతే సంగతులు.

సత్యం.

ఉత్తరం ముగించి తృప్తిగా నిట్టూర్చాను. ఇక ఇంతకు మించిన బ్రహ్మాస్త్రం ఉండదు. ఇంతలో నాగరాజు క్యారేజ్ తెచ్చాడు. క్యారేజ్ తీసుకుని డైనింగ్ రూములోకి వెళ్ళాను. ఇంతలో నాగరాజు బాక్సు తీసుకుని వరండాలోకి వెళ్తున్నాడు. ఓహో! ఇతను ఇవాళ కూడా ఎన్.వీ. అన్నమాట అనుకున్నాను. నేను కూడా నాన్ వెజిటేరియన్‌నే. కానీ మా బ్యాంక్‌లో అందరూ వెజిటేరియన్స్ కావడంతో మొహమాటంగా ఉంది. కానీ వారానికోరోజయినా ఎన్.వీ. లేకపోతే ఏం బావుంటుంది? ఒక అటెండరే వారానికి నాలుగు రోజులు ఎన్.వీ దెచ్చుకుంటుంటే నేను తెప్పించుకోలేకపోతే ఎంత ఇన్సల్టు! మంచి మెస్ ఎక్కడుందో అడగాలి. అనుకుంటూ నాగరాజు కోసం వరండాలోకి వెళ్ళాను.

నాగరాజు పిట్టగోడ దగ్గర ఉన్నాడు.

ఓహో! ఇదన్నమాట. ఈ సెక్షను అనుకుంటూ 'నాగరాజూ!' అని పిలిచాను.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు నాగరాజు.

ఒక్కసారిగా నిర్ఘాంతపోయాను. నాగరాజు టిఫిను బాక్సులో ఏమీలేదు. కేవలం ఖాళీ బాక్సు, మంచినీళ్ళు ఉన్నాయంతే. అంటే ఇతను ఎన్.వీ. అని చెప్పి ఇక్క-



# తిమిర సంహారణం

డక రావడానికి కారణం....? నాకు తల తిరిగిపోతోంది.

"ఏమిటి నాగరాజూ! ఇదేనా నీ భోజనం!"

అతను చెప్పిన సమాధానం విన్న తరువాత నేను పూర్తిగా భూమిలోకి కూరుకుపోయినట్లనిపించింది నాకు. అతనిది చాలా పెద్ద కుటుంబంట. తండ్రి చిన్నప్పుడే పోతే తల్లి కష్టపడి పెంచి పెద్దచేసిందిట. ఇంకా పెళ్ళి కావలసిన ముగ్గురు చెల్లెళ్ళున్నారట. అతను ఇంకా చెప్తున్నాడు...

"మా చెల్లాయిలకి మంచి సంబంధాలు చూసి పెళ్ళి చేయాలిసార్! మా అమ్మను కష్టపెట్టకుండా చూసుకోవాలి. ఇదేసార్! ఇంతకంటే నాకింకే కోరికలు లేవు. అందుకని తిండికూడా సరిగ్గా తినకుండా డబ్బు దాచుకుని కష్టపడుతున్నానంటే అందరూ జాలి చూపిస్తారు సార్? అది నేను భరించలేను. దయచేసి ఈ విషయం ఎవరితో చెప్పకండిసార్!"

నా కళ్ళ ముందు నాగరాజు రూపం ఎంతో ఉన్నతంగా ఎదిగిపోయింది. నేను పూర్తిగా కుంచించుకు పోతున్నాను. ఆ క్షణాన నాగరాజు నాకు పాలసముద్రంలో విష్ణుమూర్తిని మోసే ఆదిశేషువులా కనబడ్డాడు. ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేకపోయాను. కళ్ళ ముందున్న చీకటి తెరలు తొలగిపోయినట్లనిపించింది. ఛీ....ఛీ...! ఏం బ్రతుకునాది? ఒక్కణ్ణే కొడుకునని అమ్మ నన్ను ఎంత గారాబం చేసేది? తను చెల్లాయితో పోట్లాడినా చెల్లెలినే తిట్టేది. అన్నయ్యకయితే అన్ని పండుగలకీ క్రొత్త డ్రస్సులు కొంటావు. నాకెందుకు కొనవు అని చెల్లాయి దెబ్బలాడితే, రేపొద్దున అన్నయ్య మంచి ఉద్యోగం తెచ్చుకుని నీకు కొనిపెడతాడులే అని నచ్చచెప్పేది. తననెప్పుడూ పొడి అన్నం తిననిచ్చేది. కాదు. ఒక్కరోజు స్కూలు నుంచి రావడం ఆలస్యమయితే వాకిట్లోనే కూర్చుని ఎదురు చూస్తుండేది. ఆ అలవాటు పెద్దయ్యాక కూడా పోలేదు. పల్లెటూళ్లో బ్యాంకు నుండి రావడం లేటయినా బయటే ఎదురు చూస్తూ వుండేది. కానీ తనే అహంకారంతో విసుక్కుంటూ వుండేవాడు. అటువంటి అమ్మ దగ్గర్నుంచీ బ్యాంకులో ఫ్యాన్లు లేవనీ, సౌకర్యాలు లేవనీ ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఇప్పుడు చెల్లి పెళ్ళి గురించి అమ్మ ఎంతో ఆశతో ఉత్తరం వ్రాస్తే అపరేషననీ ఛీ!ఛీ!.... నన్నా దేవుడు కూడా క్షమించడు.

వెంటనే జేబులోంచి నేను వ్రాసిన ఉత్తరాన్ని తీసి ముక్కలు ముక్కలుగా చింపేశాను.

కాగితాలు తీసుకుని రెండు ఉత్తరాలు వ్రాశాను. ఒకటి అమ్మకి స్వచ్ఛమైన మనస్సుతో. రెండవది మా యూనియన్ లీడరుకి- నన్ను మళ్ళీ మా పల్లెటూరికి ట్రాన్స్‌ఫర్ చేయించమని.

ఇప్పుడు నా మనసు తలికపడింది. దట్టంగా పేరుకున్న చీకటిని ఒక్కో ఉషా కిరణం చీల్చి జగత్తును కాంతితో నింపినట్టు, ఈ రోజు నాగరాజులోని నిస్వార్థమైన తల్లి ప్రేమ నాలోని స్వార్థమనే చీకటిని తునాతనకలు చేసి తిమిర సంహారణం చేసింది.

